క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో ఎంపీడీఓ రామ్మోహన్ తదితరులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగిళ్లాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సీఎస్ఆర్ ఫండ్స్, శ్రీషిరిడి సాయి బాబా ఆలయ సభ్యులు తౌటి భుమయ్య విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే చదువుకోవాలన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకారించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా రాజిరెడ్డి



నూతన కమిటీని సన్మానిస్తున్న ప్రముఖులు

కోహెడ(హుస్నాబాద్): లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని చెంచెర్వుపల్లి గ్రామానికి చెందిన భీంరెడ్డి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా భీంరెడ్డి రాజిరెడ్డి, కార్యదర్శి చంద్రరెడ్డి ఎన్నికయ్యారు. వారిని పలువురు శాలువాలతో సన్మానించి అభినందించారు.

వితంతు దినోత్సవం



మానవ హారంలో పాల్గొన్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): అంతర్జాతీయ వితంతు దినోత్సవం సందర్భంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గుగ్గిల్లలో సోమవారం మానవహారం, ర్యాలీ నిర్వహించారు. మహిళలు భర్తలు చనిపోగానే చీకట్లు అలుముకున్నట్లు జీవించవద్దని ఆ సంస్థ కో–ఆర్డినేటర్ సుజాత సూచించారు. లింగ భేదం లేకుండా మనుషులకు మరణం సంభవిస్తుందని, వితంతువులు ఆత్మన్యూనత భావనను వీడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నామేరి, సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈఓలు

కోహెడ(హుస్నాబాద్): డిజిటల్ పట్టా పాస్ బుక్ కలిగిన ప్రతిరైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏఓ రఘు సూచించారు. మండలంలోని రాంచంద్రపూర్‌లో రైతులకు సోమవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మట్లాడుతూ వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టారన్నారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శివకుమార్, రాకేశ్ ఉన్నారు.

విద్యార్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు



విద్యార్థులతో ఎంఈఓ కనకరాజు

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన విద్యార్థులకు మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు ఆధ్వర్యంలో సోమవారం శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఉప్పరిపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీడీ విష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.12.60 లక్షల విరాళం

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సికింద్రాబాద్‌కు చెందిన భూరత్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాని మాధవ్ రూ.12.60 లక్షలు విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. విరాళం అందించిన మాధవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశంగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన నారు.. దిగుబడి బాగు

వరిసాగులో నిర్వహణ కీలకం

- విత్తన ఎంపిక కూడా ముఖ్యం
- భూ సారాన్ని బట్టి ఎంచుకోవాలి
- యాజమాన్య పద్ధతులపై సూచనలు

సిద్దిపేటఅర్బన్: వరి సాగులో అధిక దిగుబడి సాధించడానికి నారుమడి నిర్వహణ చాలా కీలకం. విత్తన ఎంపిక, నారుమడి తయారీ, నిర్వహణలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే, ఆరోగ్యకరమైన నారుని పెంచి, పొలంలో నాటిన తర్వాత మంచి దిగుబడి సాధించొచ్చు. అలాగే సరైన విత్తనాలు ఎంపిక చేసుకుని యాజమాన్య పద్ధతులు అనుసరించాలి. రుతుపవనాలు అనుకున్న సమయాని కంటే ముందే రావడంతో రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడి యాజమాన్య పద్ధతులపై రైతులుకు కొన్ని సూచనలు.

నాణ్యమైన విత్తన ఎంపిక

వరిసాగులో విత్తనం ఎంతో కీలకం. మేలైన దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాల ఎంపిక ముఖ్యం. రైతులు నీటి వనరుల ఆధారంగా, నేల స్వభావాన్ని బట్టి మంచి రకాలను ఎంపిక చేసుకోవాలి. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన రకాలను సాగుచేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. దొడ్డు రకాలైన కేఎస్ఎం –118, జేజీఎల్–24423, బతుకమ్మ(జేజీఎల్18047), ఎంటీయూ–1010 లాంటి రకాలను, సన్నరకాలలో కేఎస్ఎం–1638, తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్15048), సిద్ది (డబ్ల్యూజీఎల్–44)వంటి రకాలను సాగుచేసుకోవాలి.

నారుమడి యాజమాన్యం

వరిసాగులో నారుమడి తయారు చేసుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం అవసరం. విత్తనశుద్ధి, చీడపీడల నివారణ జాగ్రత్తలు తీసుకుంటే నారు ఆరోగ్యంగా పెరుగుతుంది.



సిద్ధమైన నారుమడి

విత్తన శుద్ధి

- లీటరు నీటికి 1గ్రా. కార్బండిజమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలపాటు విత్తనాలను నానబెట్టి ఆ తరువాత మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.
- తక్కువ నిద్రావస్థ (2–3 వారాలున్న) విత్తనాలకైతే లీటరు నీటికి 63మి.లీ, ఎక్కువ నిద్రావస్థ (4–5 వారాలున్న) విత్తనాలకై తే 100మి.లీ గాఢ నత్రికామ్లం కలిపి, ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి కడిగి మండె కట్టాలి.

విత్తన మోతాదు...

దొడ్డురకం వరి విత్తనాలు ఎకరానికి 25 కిలోలు, సన్నరకం 20 కిలోల విత్తనం సరిపోతుంది. అభివృద్ధి చేసిన రకాలు ఎకరానికి 15 కిలోలు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు ఎకరాకు 6 కిలోలు సరిపోతుంది.

నారు పెంపకం

- నారుమడిని బాగా దున్ని 2–3 మార్లు దమ్ముచేసి చదును చేయాలి. కాల్వలు ఏర్పాటు చేయాలి. ఎత్తు నారుమడులను తయారు చేసుకోవడం మంచిది.
- రెండు గుంటల్లోని(5 సెంట్లు) మడిలో విత్తనం చల్లేముందు దుక్కిలో కిలో నత్రజని చల్లాలి. మరో కిలో విత్తిన 12–14రోజులకు చల్లాలి. అదేవిధంగా కిలో భాస్వరం, కిలో పొటాష్ ఇచ్చే ఎరువులు చల్లాలి. పశువుల పేడ లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజుల్లో ఆరు తడులు ఇచ్చాక మొక్క దశలో పలుచగా నీరుంచాలి.
- జింకులోప నివారణకు లీటరు నీటికి 2గ్రా. జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.
- మెట్ట నారుమడిలో ఇనుపధాతు లోపాన్ని గమనిస్తే మొక్క వయసును బట్టి అన్నభేది 0.5 నుంచి 1గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నారు తీసే ఏడు రోజుల ముందు గుంట నారుమడి(2.5 సెంట్లకు) 400గ్రా. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకతో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. ఒకవేళ కాండం తొలుచుపురుగు ఉధృతిని గమనించినట్లైతే క్లోరాంత్రానిలిప్రోల్ 5 మి.లీ 16 లీటర్ల పంపులో కలుపుకొని ఎకరానికి సరిపడా నారుమడిపై పిచికారీ చేసుకోవాలి. దీంతో పాటుగా వేపనూనెను కూడా పిచికారీ చేసుకోవడం వల్ల గుడ్డుదశలో ఉన్న పురుగులను నివారించవచ్చు. అలాగే వేరుకుళ్ల వంటి తెగుళ్ల నివారణకు కార్బండిజం+మాంకోజబ్ 30 గ్రాముల మిశ్రమాన్ని 10 లీటర్ల నీటికి కలిపి ఎకరా నారుమడికి పిచికారీ చేసుకోవాలి. నాటు ఆలస్యమైతే రెండో దఫా నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదరకముందే నాటువేయాలి.
- నారుమడిలో కలుపు నివారణకు బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్, సేపనర్ 25మి.లీ ఎకరాకు సరిపడా నారుమడికి 5లీటర్ల నీటికి కలిపి లేదా బిస్‌పైరిబాక్ సోడియం కలుపు మందును 0.5మి.లీ లీటరు నీటికి కలిపి నాటు వేశాక 8–10రోజులకు పిచికారీ చేయాలి.
- ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉంటే నాటువేసిన 15–20 రోజులకు సైహలోఫాప్–పీ బ్యూటైల్ మందును 1.5మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



విత్తనాల ఎంపికతో పాటు ఎంచుకున్న విత్తనాలను మంచి మొలక శాతం వచ్చేలా చూసుకోవాలి. నారుమడిలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తీసేయాలి. దీని వల్ల నారు ఆరోగ్యకరంగా పెరిగి పైరుదశలో కూడా మంచిగా ఎదుగుతుంది. నారు మంచిగా ఉంటేనే దిగుబడి మంచిగా వస్తుంది. రైతులు నారుమడి యాజమాన్యంపై నిర్లక్ష్యం చేయవద్దు.

– బి.శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారి

సమ్మె నోటీసులు అందజేత

దుబ్బాక: సీఐటీయూ ఆధ్వర్యంలో జులై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని బీడీ ప్యాకర్లు, మెప్మా ఆర్‌పీలు, పంచాయతీ కార్మికులు సోమవారం సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ కార్మిక రంగాల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలన్నారు. నాయకులు భాస్కర్, రాజు, మహేశ్, భాను, కిషన్, రమేశ్, సుధాకర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

60 వేల మొక్కలే లక్ష్యం

హుస్నాబాద్‌రూరల్: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలో 60 వేల మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుగూ గ్రామానికి 3,500 మొక్కలు నాటించాలని ఇప్పటికే కార్యదర్శులను ఆదేశించామన్నారు. ఇంటింటా అవగాహన కల్పించి అందరినీ భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒక స్వీపర్ పోస్టుతోపాటు, మూడు సహాయ వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఎంఈఓ ప్రవీణ్‌బాబు సోమవారం తెలిపారు. 25 నుంచి, 28 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఏడో తరగతి చదివిన మహిళలు మాత్రమే దరఖాస్తులు చేయాలని సూచించారు.

హెడ్ కుక్ పోస్టు ఖాళీ

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ బాలికల హాస్టల్లో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి స్వాతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవం, ఆసక్తి కలిగినవారు 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



గజ్వేల్‌లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యాంప్రసాద్ సేవలు మరువలేనివి

బీజేపీ నేతలు

గజ్వేల్‌రూరల్/చేర్యాల(సిద్దిపేట)/అక్కన్నపేట (హుస్నాబాద్)/మద్దూరు(హుస్నాబాద్)/బెజ్జంకి (సిద్దిపేట)/హుస్నాబాద్/దుబ్బాకటౌన్/వర్గల్ (గజ్వేల్): జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ నేతలు కొనియాడారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌యాదవ్, సందీప్, నర్సింహ, రాంరెడ్డి, కుమారస్వామి, రాములు, మధుసూదన్, జనార్దన్, సురేశ్, శశిధర్‌రెడ్డి, శివకుమార్, శ్రీను, నాగుముదిరాజ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చేర్యాల అంబేడ్కర్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి, వడ్లకొండ సంజీవులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, మహేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రాందాసు, సంజీవరెడ్డి, ఈదిరెడ్డి, శ్రీనివాస్, సత్యవర్ధన్, సిద్ధారెడ్డి, వెంకటేశం, బాలరాజు, బాల్‌నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, సిద్దులు, మనీష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లపెల్లి వీరాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కర్ణకంటి నరేశ్ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మేడబోయిన స్వరూప, కుంట స్వప్నరెడ్డి, సౌజన్య, ఐలయ్య, బసిరెడ్డి రాకేశ్‌రెడ్డి, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండంలోని లద్నూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, అన్నోజు గోవిందాచారి, కర్రె వీరయ్య దాసరి కృష్ణ, రాపాక కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని రేగులపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, శ్రీను, అంజయ్య, శివసాయి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరాచారి, నరేశ్, రవి, అనంతస్వామి, సంతోష్, నర్సయ్య, శ్రీనివాస్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలోని ఎంపీ రఘునందన్‌రావు క్యాంపు కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా దిశ కమిటీ సభ్యుడు సుంకోజీ ప్రవీణ్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ యాదవ్, సుభాష్‌రెడ్డి, భాస్కర్, రవీందర్, తదితరులు న్నారు. వర్గల్ మండలంలోని వేలూరు, అంబర్‌పేటలో బీజేపీ అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలు గౌడ్, శ్రీపతి, బుచ్చిరెడ్డి, రమేశ్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

ఏసీపీ నర్సింహులు

గజ్వేల్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఏసీపీ నర్సింహులు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ నుంచి చౌరస్తా వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగిఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్, సీఐలు సైదా, ముత్యంరాజ్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్(దుబ్బాక): విద్యార్థులు చదువుకునే దశ నుంచే డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

వర్గల్(గజ్వేల్): గ్రామాలలో డ్రగ్స్, గంజాయి ఆనవాళ్లు లేకుండా చేసి డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని గౌరారం ఎస్ఐ బి.కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాంటీడ్రగ్స్ అవేర్‌నెస్ వారోత్సవాలలో భాగంగా సోమవారం తున్కిఖాల్సా జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడి యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు.

భవిష్యత్ అంధకారం

కోహెడ(హుస్నాబాద్): మత్తు పదార్థాల అలవాటుతో భవిష్యత్ అంధకారం అవుతుందని ఎస్ఐ అభిలాష్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, ఏఎస్ఐ కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



గజ్వేల్ బాలికల హబ్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఏసీపీ నర్సింహులు, తహసీల్దార్ శ్రావణ్

చదువుపైనే దృష్టి సారించాలి

కొండపాక(గజ్వేల్): విద్యార్థుల దృష్టంతా చదువుపైనే ఉండాలని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లకుడారం హైస్కూల్లో విద్యార్థులు, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసమే షీటీంలు ఏర్పాటు చేశారన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేసినా, వేధించినా తమ దృష్టికి తేవాలని కోరారు. హెచ్ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు అనంతరామారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ వెంకట్ గౌడ్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని చెప్పారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పలు కిరాణా షాపులను, పాన్‌షాపులను తనిఖీ చేశారు. గుట్కా, డ్రగ్స్ వంటివి అమ్మవద్దని హెచ్చరించారు.

అందరి సహకారం అవసరం



మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

హుస్నాబాద్: గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఏసీపీ సదానందం కోరారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. స్కూల్, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, హెచ్ఎం వాసుదేవరెడ్డి, ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ఎక్సైజ్ సీఐ పవన్ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్ఐ రూప ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను వాడినట్లు గమనిస్తే పోలీస్‌లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షపతి, అధ్యాపకులు బాలరాజు, పరిషవేణి, ఇందిరా నైనాదేవి, కుమారస్వామి, విజయ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

దుబ్బాక: ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో సోమవారం పేషెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

◆ జాబ్‌మేళాకు 80 మంది హాజరు

వర్గల్(గజ్వేల్): స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 80 మంది విద్యార్థినులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. మ్యాజిక్ బస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్, జస్ట్ డయల్, హెచ్ఆర్, ట్రెండ్జ్ ఐటీ, క్వెస్కోర్ కంపెనీల ప్రతినిధులు విద్యార్థినులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ప్రాజెక్ట్ మేనేజర్ సృజన్, కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ వి.రాధ, తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులను ప్రారంభించండి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గతంలో మంజూరైన సీసీ రోడ్ల పనులను ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకులు కల్యాణ్‌కర్ నర్సింగరావు కోరారు. మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్యకు కాలనీవాసులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

◆ ఎమ్మెల్యే పల్లాకు పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల ప్రమాదవశాత్తు జారి పడి శస్త్రచికిత్స చేయించుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, ఏఐఎఫ్‌బీ జిల్లా కార్యదర్శి ఆందె బీరయ్య పరామర్శించారు. సోమవారం వారంతా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

◆ బైరాన్‌పల్లి పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లి అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మద్దూరులో మండల కార్యదర్శి జంగిలి యాదగిరి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 8వ మహాసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రజాకార్లకు వ్యతిరేకంగా వీరబైరాన్‌పల్లిలో 108 మంది ప్రాణ త్యాగంచేసి ఈ ప్రాంతాన్ని విముక్తి కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అందె అశోక్, భూమయ్య, కనకయ్య పాల్గొన్నారు.

◆ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

గజ్వేల్: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని గజ్వేల్, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు మోహన్, ప్రభాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాల అభివృద్ధికి చేయూత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు రూ.50 వేలు సాయం అందించారు. పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించి పలువురి నుంచి వనరుల నిమిత్తం రూ.50 వేలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, మురళి తదితరులు పాల్గొన్నారు.

◆ సమగ్ర సస్యరక్షణతో చీడపీడల నివారణ

వర్గల్(గజ్వేల్): కూరగాయల తోటల్లో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు ఆచరించాలని జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ శాస్త్రవేత్త డాక్టర్ సాయికృష్ణ నిఖిల్ సూచించారు. వర్గల్ మండలం తున్కిఖాల్సా రైతు వేదికలో ఏఓ శేషశయన పర్యవేక్షణలో సోమవారం ఉద్యాన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టారీతిగా క్రిమి సంహారకాలు వాడొద్దన్నారు. అగ్రోనమిస్ట్ సుబ్బారావు ఫర్టిగేషన్ ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో కోరమండల్ ఏరియా మేనేజర్ ఆర్‌కే నాయుడు, జీడిమెట్ల హార్టికల్చర్ అధికారి జలంధర్, ఉద్యానాధికారి డి.రమేశ్, ఏఈఓలు మానస, సునీత, భారతి పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో 22 మంది పట్టుబడ్డారు. సోమవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.40 వేల జరిమానా విధించారు.

◆ పేదల కల సాకారం

సిద్దిపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల కలను సాకారం చేసిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్‌లో మాజీ సర్పంచ్ సదాశివారెడ్డితో కలిసి ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలు పొందిన 52 మంది వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని కోరారు. అంజిరెడ్డి, మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ మందులతో క్షయ నివారణ సాధ్యమే..

ములుగు(గజ్వేల్): క్షయ(టీబీ)ను మొదటి దశలోనే గుర్తించి మందులు వాడితే పూర్తిగా నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.దీప్తి చెప్పారు. పీహెచ్‌సీలో సోమవారం క్షయ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బరువు తగ్గడం, దగ్గుతోపాటు తెమడ రావడం, లాంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యాధికారులు హరిత, కిరణ్ ఆరోగ్య సిబ్బంది శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ కేర్ టేకర్లను తొలగించడం సరికాదు

చిన్నకోడూరు(సిద్దిపేట): గురుకుల పాఠశాలలో పదేళ్ల నుంచి పనిచేస్తున్న అసిస్టెంట్ కేర్ టేకర్లను కార్యదర్శి వర్షిణి తొలగించడం సరికాదని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉమేశ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్లేశ్, బాబు, హరికిరణ్, లింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆక్రమణలు తొలగించాలని వినతి

ములుగు(గజ్వేల్): మండలంలోని మాసాన్‌పల్లి చెరువుకుంటల్లో ఆక్రమణలను తొలగించాలని మాసాన్‌పల్లి గ్రామస్తులు తహసీల్దార్ ఆరీఫాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కోమటికుంట, తాత కుంటలో భూమిని కొందరు ఆక్రమించారని, అధికారులు కడీలను తొలగించాలని కోరారు.

◆ మెరుగైన విద్యా బోధనకు సహకారం

మిరుదొడ్డి(దుబ్బాక): పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్న లక్ష్యంతో సహకారం అందిస్తున్నట్లు అనంతరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాధవరెడ్డి చెప్పారు.అల్వాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోటు బుక్కులు అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ సర్పంచ్ కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ దిలీప్ పాల్గొన్నారు.